# India-Thailand Foreign Office Consultations

April 21, 2022

# భారత్-థాయ్‌లాండ్ విదేశాంగ కార్యాలయ సంప్రదింపులు

ఏప్రిల్ 21, 2022

భారత్, థాయ్‌లాండ్ మధ్య ఆరో విడత విదేశాంగ కార్యాలయ సంప్రదింపులు న్యూఢిల్లీలో 2022 ఏప్రిల్ 21న జరిగాయి. భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖకు చెందిన సెక్రటరీ (తూర్పు) శ్రీ సౌరభ్ కుమార్ అలాగే థాయ్‌లాండ్ విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ శాశ్వత సెక్రటరీ గౌరవనీయ శ్రీ థని థోంగ్‌ఫాక్డీ ఈ చర్చలకు సంయుక్తంగా అధ్యక్షత వహించారు. కోవిడ్-19 మహమ్మారి వల్ల ఈసారి సమావేశం మూడేళ్ల అనంతరం జరిగింది.

సమావేశం సందర్భంగా రాజకీయ, రక్షణ మరియు భద్రత, ఆర్థిక మరియు వాణిజ్య, సాంస్కృతిక, శాస్త్ర- సాంకేతిక, పర్యాటక, ప్రజా సంబంధాలు, కోవిడ్-19 అనంతరం ఆర్థిక రికవరీ, టీకాల విషయంలో సహకారం, ఇరు దేశాల ప్రయోజనాలు ఇమిడి ఉన్న ఇతరత్రా అంశాలు సహా మొత్తం ద్వైపాక్షిక సంబంధాలను ఇరు ప్రతినిధి బృందాలు సమీక్షించాయి. ఆయా రంగాల్లో కలిసి పనిచేసేందుకు తాము కట్టుబడి ఉన్నామని ఇరు పక్షాలు పునరుద్ఘాటించాయి. భారత్-మయన్మార్-థాయ్‌లాండ్ హైవేను వీలైనంత త్వరగా అందుబాటులోకి తేవడం, పోర్టులను మరింతగా అనుసంధానించడం సహా కనెక్టివిటీని మెరుగుపర్చుకోవాలని ఇరు పక్షాలు అంగీకరించాయి. ఐక్యరాజ్యసమితి (యూఎన్), ఇతర అంతర్జాతీయ సంస్థల్లో పరస్పర సహకారంతో సహా అనేక ప్రాంతీయ, బహుళపక్ష అంశాలపై ప్రతినిధి బృందాలు తమ అభిప్రాయాలను ఇచ్చిపుచ్చుకున్నాయి. 2022-23 ఏడాదికి గాను బహుళ రంగాల్లో సాంకేతిక, ఆర్థిక సహకారానికి సంబంధించి బంగాళాఖాత దేశాల కార్యక్రమం (బిమ్‌స్టెక్ – BIMSTEC) అధ్యక్ష హోదాను అందుకోవడంపై థాయ్‌లాండ్‌కు సెక్రటరీ (తూర్పు) అభినందనలు తెలిపారు. భారత్ తన పూర్తి మద్దతు, సహకారాన్ని అందిస్తుందని ఆయన హామీ ఇచ్చారు. ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేసుకునే దిశగా పని చేయడంపై నిబద్ధతగా ఉన్నామని ఇరు పక్షాలు పునరుద్ఘాటించాయి.

భారత్, థాయ్‌లాండ్ మధ్య దౌత్య సంబంధాలు ఏర్పడి ఈ ఏడాదితో 75 ఏళ్లు పూర్తి అవుతుండటంతో ఈ సందర్భాన్ని సముచిత రీతిలో జరుపుకోవాలని ఇరు పక్షాలు నిర్ణయించాయి. 2022 ఏప్రిల్ 21న గౌరవనీయ విదేశీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి డా. రాజ్‌కుమార్ రంజన్ సింగ్‌ను కూడా థాయ్‌లాండ్ ప్రతినిధి బృందం కలిసింది.

**న్యూఢిల్లీ**
**ఏప్రిల్ 21, 2022**

DISCLAIMER: This is an approximate translation. The original is available in English on MEA’s website and may be referred to as the official press release.